సంపూర్ణ ఆరోగ్యానికి 'సురక్ష'

- ఇంటి చెంతనే వైద్యసేవలపై ప్రజల హర్షం
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన

పెదగంట్యాడ: పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. రెండో విడత చేపట్టిన శిబిరాల్లో వైద్య సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

77వ వార్డులో..

జీవీఎంసీ 77వ వార్డు పెదపాలెం సచివాలయం పరిధిలోని నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీకి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ప్రత్యేక వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించి, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆధునిక యంత్రాలతో పాటు స్పెషలిస్టు వైద్యులను సైతం ఇళ్ల వద్దకే తీసుకొచ్చి పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందజేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

468 మందికి వైద్యసేవలు

శిబిరంలో 468 మంది రోగులను ఆరుగురు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ రాజా, జీవీఎంసీ సిబ్బంది చిరంజీవి, వైద్య సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, బి.గోపాలం, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

67వ వార్డులో 440 మందికి సేవలు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యతను కల్పించిందని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. 67వ వార్డులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి పీహెచ్‌సీ పరిధిలోను పేదల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఎంతటి అనారోగ్య సమస్యకైనా ఈ శిబిరాల్లో వైద్యం లభిస్తుందని, అవసరమైతే రిఫరల్ ఆస్పత్రికి పంపించి నయం చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలను ఇచ్చిందని తెలిపారు. పేదల కోసం ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని కూడా రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. అనంతరం వైద్య నిపుణులు వివిధ రకాల వైద్య సేవలను అందించారు. ఓపీలో 440 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించినట్టు వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, స్పెషలిస్టు డాక్టర్లు విజయలక్ష్మి, శ్రీనివాస్, మానస, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు, స్థానిక నాయకులు అచ్చినాయుడు, కిరీటం, రజిని పాల్గొన్నారు.


67వ వార్డులోని శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


77వ వార్డులోని శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


67వ వార్డులో రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది


మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ రాజా

హోరాహోరీగా ఖోఖో మండల స్థాయి పోటీలు


రెండు జట్ల మధ్య టాస్ వేస్తున్న పోటీల నిర్వాహకులు


ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా తలపడుతున్న నాయుడుపాలెం, పెదముషిడివాడ జట్లు

అగనంపూడి: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా పరవాడ మండల స్థాయి ఖోఖో పోటీలు 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల నుంచి పురుషులు, మహిళల జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. పరవాడ మండల అభివృద్ధి అధికారి హేమసుందరరావు, ఎంఈవోలు సాయి శైలజ, దివాకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నువ్వా నేనా అన్నట్లు క్రీడాకారులు తలపడ్డారు. పురుషుల పోటీల్లో నాయుడుపాలెం జట్టు పెదముషిడివాడ జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అనకాపల్లి కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఆడుదాం ఆంధ్రా పరవాడ మండల కో-ఆర్డినేటర్ లోవరాజు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు బి.అన్నాజీరావు, తులసీ సత్యవతి, ఎస్.వి.రమణ, శ్రీదేవి, శ్రీలక్ష్మి, షమాభాను, దేవి, అమ్మాజీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

24 నుంచి ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ పోటీలు

- విజయవంతానికి అందరూ సహకరించాలి
- ప్రత్యేకాధికారి లక్ష్మారెడ్డి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, కోచ్‌లు, సిబ్బంది

గాజువాక: ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహించనున్న గాజువాక నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి డి.లక్ష్మారెడ్డి కోరారు. ఆడుదాం ఆంధ్రా పోటీల నియోజకవర్గ కమిటీ ప్రతినిధులతో గురువారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల కోసం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌తో పాటు ఉక్కునగరంలోని మరో రెండు మైదానాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయా మైదానాల్లో క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పోటీలను కమిటీలో ఉన్న అన్ని విభాగాల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. క్రీడా పోటీలు కొనసాగుతున్న సమయంలో పోలీసులు, వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, పలువురు కోచ్‌లు, పీఈటీలు, పీడీలు, జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ


నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీ సాయి మందిరం ఆధ్వర్యంలో వంద మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు చేతులమీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా మందిరం ద్వారా ఆధ్యాత్మిక సేవతో పాటు సేవా కార్యక్రమాలు చేపడుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, పి.రామారావు, ఆర్.మణికంఠ, పీఎల్ఎన్ రాజు, సత్యనారాయణ, సత్యలక్ష్మి, ఆర్.సత్య శ్రీదేవి, పంకజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగుల తొలగింపు సరికాదు'

ఉక్కునగరం: ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తగవని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. వాటిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం యూనియన్ నాయకులు సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీను కలిసి సమస్యలపై చర్చించారు. సుమారు 1500 మంది తొలగిస్తారని వస్తున్న వార్తలు ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో అన్ని విభాగాలు సతమతమవుతుంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొమ్ము ప్రసాదరావు, కె.అవతారం, వి.ఎం.నాయుడు, సుబ్బయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయానికి మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్ అందిస్తున్న దాతలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు హనుమాన్ నగర్‌లో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయానికి పెదగంట్యాడ మండలం గంగవరం దరి దిబ్బపాలెం గ్రామానికి చెందిన వాడమెదల సింహాద్రి దంపతులు రూ.26 వేలతో సమకూర్చుకున్న మైక్‌సెట్‌ను బహూకరించారు. ఆలయ కమిటి ప్రతినిధులకు గురువారం దానిని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు లాలం అప్పలనాయుడు, సమ్మెంగి సోమేశ్వరరావు, ఓలిశెట్టి అప్పలరాజు, ఈరుగుల లక్ష్మీ ప్రసాద్, కె.అప్పలనాయుడు, చంటి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల మద్దతు


సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో తలపెట్టిన కార్మిక సమ్మెకు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఎల్ఎంఎం పార్కులో గురువారం నిర్వహించిన అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు వేతనాలు పెంచాలని, 60 ఏళ్లకు పైబడిన కార్మికులను తొలగించే సమయంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు అందరూ పాల్గోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పి.భాస్కరరావు, కొవిరి అవతారం, ఎం.రమణ, శ్రీనివాస్, సోంబాబు, పిట్టారెడ్డి, నాగరాజు, రామిరెడ్డి, సత్యారావు, సిహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక సాధికారత


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


సామాజిక సమత సంకల్ప మహోత్సవంలో భాగంగా సంతకం చేస్తున్న ఉరుకూటి చందు

అగనంపూడి: వైఎస్సార్‌సీపీతోనే సామాజిక సాధికారత సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. 88వ వార్డు మంగళపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ సామాజిక సమత సంకల్ప మహోత్సవాల్లో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రంలో ఓ చారిత్రక ఘట్టానికి ముఖ్యమంత్రి జగన్ తెర లేపుతున్నారన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున అంబేడ్కర్ అభిమానులు హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఎం.శ్యామ్, వారాధి రాజు, చింతా అప్పారావు, సోమేశ్వరావు పాస్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుల గణన

గాజువాక: ఈ నెల 19 నుంచి 28 వరకు కుల గణన నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాజువాక నియోజకర్గంలో కుల గణనకు జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించనున్నారు. వారు తమ వార్డు సచివాలయాల పరిధిలోని ఇళ్లకు వెళ్లి నివాసుల వివరాలను నమోదు చేయనున్నారు. ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేసే సమయంలో వారి మొబైల్ ఫోన్‌కు ఒక ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని సర్వే సిబ్బందికి చెబితే వివరాలు నమోదవుతాయని, దీనికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. గాజువాకలో సచివాలయ సిబ్బందితో పాటు 1900 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన గృహాలతో పాటు అదనంగా కేటాయించిన గృహాలకు కూడా వెళ్లి సర్వేలో పాల్గొంటారని జెడ్సీ తెలిపారు.

లబ్ధిదారులకు డాక్యుమెంట్ల పంపిణీ


లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్ అందజేస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని గాజువాక హౌస్ కమిటీ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. వార్డులోని హౌస్ కమిటీ ప్రాంతమైన కాళికానగర్, గిరి ప్రసాద్ కాలనీ, రాజీవ్‌నగర్, గుడివాడ అప్పన్న కాలనీలో 68 మంది లబ్ధిదారులకు తమ ఆస్తులపై అన్ని హక్కులను కల్పిస్తూ మంజూరు చేసిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని హౌస్ కమిటీ ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ గుడివాడ సాయి అనూషకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి శ్యామలరావు, గుర్రం త్రినాథ్, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, సీఎం జగన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అంబేడ్కర్, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు గురువారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, రోజారాణి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మ బాబా స్మృతి దినోత్సవం


స్మృతి దినోత్సవ చిత్ర పటాలను ఆవిష్కరిస్తున్న లక్ష్మి, కేఎన్ఆర్

పెదగంట్యాడ: ప్రపంచ శాంతి కోసం పాటు పడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కల్పిస్తున్న బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయమని యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి అన్నారు. 65వ వార్డు భానోజీ తోటలో బ్రహ్మ బాబా స్మృతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్మృతి దినోత్సవ చిత్ర పటాలను ఆవిష్కరించారు. బ్రహ్మకుమారి మణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, అండిబోయిన అప్పారావు, పులి వెంకటరమణారెడ్డి, అండిబోయిన శ్రీను, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను మొండి బకాయిలు రూ.6.12 కోట్లు

జప్తు నోటీసులు అందజేసిన జీవీఎంసీ అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎన్నిసార్లు అడుగుతున్నా పన్ను చెల్లించని గృహ యజమానులకు జప్తు నోటీసులను అందజేస్తున్నారు. 1.20లక్షల అసెస్‌మెంట్లున్న గాజువాక జోన్‌లో ఇప్పటివరకు 60 శాతం ఆస్తి పన్ను వసూలైనప్పటికీ మొండి బకాయిలు మాత్రం అధికారులను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ బకాయిలు రూ.6.12 కోట్లు వసూలు కావాల్సి ఉందని రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ తెలిపారు. ఎన్నిసార్లు హెచ్చరించినా స్పందించని పన్ను చెల్లింపుదారులకు జప్తు నోటీసులను అందజేశారు. వీటితో పాటు నీటి కుళాయి కనెక్షన్‌ల రద్దుకు కూడా నోటీసులను అందించారు. జప్తు నోటీసుల పంపిణీ తరువాత కొంతమంది స్పందించారని, పన్ను చెల్లించకపోతే నీటి కుళాయిలను కట్ చేయడంతో పాటు ఆస్తిని కూడా జప్తు చేస్తామని అధికారులు తెలిపారు.

1071వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు


1071వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1071వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులతో పాటు ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనస్థితిలో ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహగిరిపై 'స్వచ్ఛ తీర్థ'

సింహాచలం: సింహగిరిపై గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింహగిరిపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ రాజగోపురం వద్ద ఉన్న చెత్తను తొలగించారు. దేవస్థానం ఉద్యోగి లంక సూరిబాబు, శానిటేషన్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు


స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి కమనీయంగా కల్యాణం జరిపించారు. అర్చకులు టి.పి. రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.


నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

గొర్రె దొంగతనం కేసులో ముగ్గురిపై కేసు

ఉక్కునగరం: గొర్రెను దొంగతనం చేసిన కేసులో స్టీల్‌ప్లాంట్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పరవాడ సమీప దేశపాత్రునిపాలేనికి చెందిన ఉరుకూటి పైడిరాజు కొన్ని గొర్రెలను మేపేందుకు గురువారం టౌన్‌షిప్‌లోని సెక్టార్-9కు తీసుకు వచ్చాడు. సాయంత్రం గొర్రెల మందలోని ఒక గొర్రె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెదికారు. అనుమానం వచ్చి అదే సెక్టార్‌లోని 315బీ క్వార్టర్‌లోకి వెళ్లి చూడగా అక్కడ గొర్రె పీక కోసి ఉంది. దీంతో పైడిరాజు తమ గొర్రెను స్టీల్‌ప్లాంట్ ఫోర్‌మన్ కొయ్యూరు గోపీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ ఎం.రమేష్‌కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు జి.శంకర్ నాయక్ అపహరించి, చంపివేశారని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వి.శ్రీనివాసరావు క్వార్టర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. గొర్రె కళేబరాన్ని పోస్టుమార్టంకు పంపనున్నామని సీఐ తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు


పైలాన్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా అగనంపూడి టోల్‌గేటు పైలాన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, గొల్లవిల్లి కనక భవానీ, కరణం సత్యారావు, గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. 85వ వార్డు పెదమడకలోని నిర్వహించిన కార్యక్రమంలోనాయకులు శ్రీనివాసరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

పెదగంట్యాడ: హౌసింగ్‌బోర్డు జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు నివాళులర్పించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. బి.అప్పారావు, సుదర్శన్, కూన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఆధ్వర్యంలో నెల్లిముక్కు జంక్షన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

20న జీడిమామిడితోట ఫలసాయానికి వేలం

సబ్బవరం: లింగాల తిరుగుడులో శ్రీసోమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన జీడిమామిడి తోట ఫలసాయం ఏడాది కాలం అనుభవించేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఆదినారాయణ ప్రకటనలో తెలిపారు. దేవాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గోవచ్చని తెలిపారు.